సాక్షి
వికారాబాద్

సోమవారం । 13 । అక్టోబర్ । 2025



తెల్లబంగారం మెరిసేనా!

కొద్ది రోజుల్లో పత్తి పంట చేతికి రానుంది. కొంత కాలంగా దిగుబడి ఉన్నప్పటికీ.. సరైన మద్దతు ధర లేదు.

8లో▸



పర్యావరణ రక్షణకు కృషి

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పర్యావరణ వేత్త, ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి అన్నారు.

8లో▸



వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

దుద్యాల్ మండలం హకీంపేట మల్లికార్జున స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాప నోత్సవం వైభవంగా జరిగింది.

9లో▸

న్యూస్‌రీల్

ఘనంగా నృసింహుడి బ్రహ్మోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

పరిగి: లక్ష్మీనర్సింహ స్వామి చతుర్థ బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా.. తొలిరోజు ఆదివారం స్వామి వారికి వేదస్వస్తి, యాగశాల ప్రవేశం, విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, దీక్షాధారణ, రుత్విక్కరణం, మృత్సంగ్రహణ, అంకురార్పణ, అఖండ దీపారాధన, అగ్ని ప్రతిష్ఠ హోమం, ధ్వజారోహణం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగాలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

రిజర్వేషన్లపై అగ్రకులాల కుట్ర

- బీసీ సంఘం నాయకుల ఆరోపణ
- 18న తాండూరు బంద్‌కు పిలుపు



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

తాండూరు టౌన్: బీసీ రిజర్వేషన్లపై ఉన్నత న్యాయస్థానం స్టే ఇవ్వడం అగ్రకులాల కుట్రలో భాగమేనని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ ఆరోపించారు. బహుజనులు బానిసలుగానే ఉండాలనే వారి దురహంకారాన్ని ఎండగడతామన్నారు. స్టేకు నిరసనగా ఈ నెల 18న తాండూరు బంద్‌కు పిలుపునిచ్చామని పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా బంద్ నిర్వహించనున్నట్లు తెలిపారు. రిజర్వేషన్లు అమలు చేసే పోరాటం ఆగదని స్పష్టం చేశారు. బంద్‌కు వ్యాపారులు, విద్యా సంస్థలు, పార్టీలకు అతీతంగా సహకరించాలని ఆయన కోరారు.

నడక ఆరోగ్యానికి మేలు



పట్టణంలో యువమంచ్ వాక్‌థాన్

తాండూరు టౌన్: మార్నింగ్ వాక్ ఆరోగ్యానికి మేలు చేస్తుందని మార్వాడీ యువమంచ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు మన్మోహన్ సార్డా అన్నారు. ఆదివారం యువమంచ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచ్ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్ ప్రకాష్ సార్డా జెండా ఊపి వాక్‌థాన్‌ను ప్రారంభించారు. అనంతరం మన్మోహన్ మాట్లాడారు. నేటి ఉరుకుపరుగుల జీవితంలో ప్రజల ఆహారపు అలవాట్లు మారాయని, వ్యాయామానికి దూరమయ్యారని తెలిపారు. తద్వారా ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు. నిత్యం గంటపాటు నడిస్తే ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. మంచ్ తాండూరు అధ్యక్షుడు అనిల్ సార్డా, కార్యదర్శి సచిన్ రాఠి, కోశాధికారి అరుణ్ సార్డా, రోహిత్ అగర్వాల్, సూర్య ప్రకాష్ సోమాని తదితరులు పాల్గొన్నారు.

భూ బాధితులకు ఇంటి జాగలు

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఎమ్మెల్యేను కలిసిన భూ బాధితులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎల్మినేడు భూ బాధితులకు ఇచ్చిన మాట ప్రకారం ఇంటి జాగలు ఇచ్చి ఆదుకుంటానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం భూ బాధితులు ఎమ్మెల్యేను కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే ముఖ్యమంత్రిని ఒప్పించి, కలెక్టర్‌కు ఆదేశాలు ఇప్పించామన్నారు. త్వరలో అధికారులు మరలా ఎల్మినేడుకు వస్తారన్నారు. మొదట ఎంజాయ్‌మెంట్ సర్వే చేపట్టి, రికార్డు ప్రకారం అర్హులైన రైతులకే ప్లాట్లు ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. అక్రమాలు, అవినీతి జరిగితే లీగల్‌టీం క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటుందని వివరించారు.

డీసీసీ పీఠం ఎవరిదో!

స్థానిక ఎన్నికల నేపథ్యంలో అధికార పార్టీ కాంగ్రెస్.. సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించింది. ఎన్నికల్లో పై చేయి సాధించడమే లక్ష్యంగా కసరత్తు చేస్తోంది. ఈ మేరకు జిల్లాకు కొత్త సారథిని ఎంపిక చేసే పనిలో బిజీగా ఉంది. ఇందులో భాగంగా కేడర్ నుంచి అభిప్రాయ సేకరణ కోసం ఏఐసీసీ పరిశీలకుల బృందం పర్యటించనుంది.



అధ్యక్ష పీఠంపై ఆశావహుల పోటీ

- సమర్థుడి వేటలో అధిష్టానం
- అందరి అభిప్రాయాలతో హస్తినకు జాబితా
- ఏఐసీసీ, పీసీసీ పరిశీలకుల పర్యవేక్షణలో స్క్రూటినీ
- మరోసారి టీఆర్‌ఆర్‌కే పట్టం!, పరిశీలనలో మరికొన్ని పేర్లు

వికారాబాద్: జిల్లాలకు డీసీసీ అధ్యక్షులను నియమించేందుకు ఏఐసీసీ, పీసీసీ కసరత్తు చేస్తున్న నేపథ్యంలో.. అధికార పార్టీతో పాటు, ప్రతిపక్ష పార్టీల్లోనూ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎవరనేదానిపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. మూడేళ్లకోసారి పార్టీ సంస్థాగత పటిష్టతలో భాగంగా ఏఐసీసీ నూతన కమిటీలను నియమిస్తుంది. జిల్లా ఏర్పాటు అయ్యాక తొలిసారి తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి డీసీసీ అధ్యక్షుడిగా పని చేశారు. అనంతరం ఆయన పార్టీ వీడటంతో.. ఆ పదవిని ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డిని అధిష్టానం నియమించింది. ఆ తరువాత 2022లో కొత్త కమిటీలు వేయగా.. రెండోసారి సారి కూడా టీఆర్‌ఆర్‌కే పీఠం వరించింది. రెండు పర్యాయాలు(ఆరేళ్లు)గా ఆయన బాధ్యతలు చేపడుతూ వచ్చారు. ప్రస్తుతం పదవీ కాలం ముగియటంతో.. కొత్త అధ్యక్షులను నియమించేందుకు పార్టీ కసరత్తు చేస్తోంది. 2023 ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన సారథ్యంలోనే.. జిల్లాలో ఉన్న నాలుగింటికి నాలుగును పార్టీ హస్తగతం చేసుకుంది. ఈ నేపథ్యంలో మరోసారి ఆ పదవి ఆయనకే కట్టబెట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయని పార్టీ నేతలు పేర్కొంటున్నారు.

ఈ సారి వినూత్నంగా..

సాంప్రదాయాలకు భిన్నంగా ఈ సారి అధ్యక్షుల నియామకం విషయంలో అధిష్టానం కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. ఆశావహులు ఎందరున్నా.. దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఒక ఫారం ఇచ్చి, అందులోనే ఆశావహుల వివరాలను నమోదు చేయిస్తోంది. వారు గతంలో పార్టీ పరంగా.. ప్రజా ప్రతినిధులుగా ఏ హోదాల్లో పని చేశారు. పార్టీకి అందించిన సేవలు తదితర పూర్తి వివరాలు ఫారంలో పొందుపర్చాల్సి ఉంటుంది.

ఏఐసీసీ బృందం పర్యటన

కేరళకు చెందిన ఎంపీ సారథ్యంలోని ఏఐసీసీ బృందం ఈ నెల 14వ తేదీలోగా జిల్లాలో పర్యటించనుంది. ఆ బృందం సభ్యులు జిల్లా పర్యటన సందర్భంగా క్షేత్రస్థాయి కార్యకర్తలు, నేతలతో పాటు, ఎమ్మెల్యేల అభిప్రాయాలు తీసుకోనుంది. ఈ ప్రక్రియ ముగియగానే ఏఐసీసీ బృందంతో పాటు పీసీసీ చర్చించి, ఆరుగురి పేర్లను ఫైనల్ చేయనుంది. సీల్డ్ కవర్‌లో ఖర్గే సారథ్యంలోని పార్టీ పెద్దలకు అందజేస్తారు. పరిశీలన అనంతరం అధ్యక్షుడి ఎంపిక ఉంటుందని తెలుస్తోంది. అదీ నెలాఖరులోగా ముగియనున్నట్లు సమాచారం.

సమర్థుడి కోసం అన్వేషణ

డీసీసీ పీఠం దక్కించుకునేందుకు ఆశావహులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు పార్టీలో చర్చ. స్థానిక సంస్థల ఎన్నికలు మొత్తం డీసీసీ అధ్యక్షుల సారథ్యంలోనే జరుగుతాయి. మరో మూడేళ్లలో సాధారణ ఎన్నికలు రానున్నాయి. ఇవి కూడా ఇప్పుడు నియమించబోయే అధ్యక్షుడి ఆధ్వర్యంలో జరగనున్నాయి. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని, సమర్థవంతమైన నాయకుడికి పట్టం కట్టాలనే ఆలోచనలో పార్టీ హస్తిన పెద్దలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో జిల్లా పార్టీని నడిపించటంతో పాటు ప్రతిపక్ష పార్టీ నేతలను ఎదుర్కోగల సత్తా ఉన్న నేతకు పట్టం కట్టబెట్టే అవకాశాలు ఉన్నాయి.

రేసులో కొత్తపేర్లు

గతంలో డీసీసీ రేసులో ఉండి తప్పుకున్న నేతలతో పాటు మరికొన్ని కొత్త పేర్లు పీఠం రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు టీఆర్‌ఆర్‌తో పాటు వికారాబాద్‌కు చెందిన సుధాకర్‌రెడ్డి, ధారూరు మండలానికి చెందిన రఘువీరారెడ్డి, తాండూరుకు చెందిన బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఇందులో ఉన్నారు. ఒకవేళ బీసీ నేతకు ఇవ్వాలనే ఆలోచనలో పార్టీ పెద్దలు ఉన్న నేపథ్యంలో.. తాండూరుకు చెందిన ఉత్తంచంద్, వికారాబాద్‌కు చెందిన గుడిసె లక్ష్మణ్, పరిగి వాసి హన్మంతు ముదిరాజ్, లాల్‌కృష్ణ ప్రసాద్‌లలో ఎవరికో ఒకరికి అవకాశం దక్కనుంది. సమర్థులకే అంటే.. ప్రస్తుత ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డిలలో ఒకరికి పీఠం దక్కే అవకాశం లేకపోలేదు.

పరిగికి పవర్ సమస్య లేకుండా చేస్తా

- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- 400 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీఆర్‌ఆర్

పరిగి: పరిగికి విద్యుత్ సమస్య లేకుండా చేస్తానని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని ఆయన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పరిగికి కొత్తగా 400కేవీ సబ్‌స్టేషన్ మంజూరు అయిందని, త్వరలో శంకుస్థాపన చేస్తానని చెప్పారు. గతంలో కాంగ్రెస్ హయాంలో 400కేవీల సబ్‌స్టేషన్ మంజూరు అయితే.. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎలాంటి పనులు చేపట్టలేదని ఆరోపించారు. మళ్లీ కాంగ్రెస్ వచ్చాకే సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి, పనులను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటున్నానని తెలిపారు. రూ.400 కోట్లతో సబ్‌స్టేషన్ నిర్మాణం జరుగుతుందని, జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా ఇక్కడ సబ్‌స్టేషన్ ఏర్పాటు అవుతుందన్నారు. పరిగిలో ఇప్పటికే 220 కేవీ సబ్‌స్టేషన్, విండ్‌పవర్, సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతుందని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తోందని తెలిపారు. అధికారం చేపట్టిన ఏడాదిలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేసిందని, రైతులకు రుణమాఫీ, పేదలకు సన్నబియ్యం అందిస్తోందన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ పాల్గొన్నారు.



మెడికల్ కళాశాల నిర్మాణ ప్రాంతం

విద్యాలయాల తరలింపు!

- ఆగిన ఇంటిగ్రేటెడ్ మెడికల్ కళాశాల నిర్మాణ పనులు
- ఆందోళన బాటలో ఐక్య కార్యాచరణ కమిటీ
- కడా అధికారిని కలిసిన ఉపాధ్యాయ సంఘాలు
- అయోమయంలో కొడంగల్ ప్రజలు

కొడంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌కు మంజూరు అయిన ప్రభుత్వ మెడికల్ కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాలను మరో ప్రాంతానికి తరలిస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇదే విషయమై ఇటీవల ఉపాధ్యాయ సంఘాలు కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశాయి. శనివారం సీఎంను కలవడానికి వెళ్లిన ఉపధ్యాయులకు అపాయింట్‌మెంట్ దొరకలేదు. దీంతో వారు నిరాశగా వెనుదిరిగారు. కాగా.. కళాశాల, గురుకుల భవనాలు నిర్మిస్తున్న ప్రాంతాన్ని 'సాక్షి' ఆదివారం విజిట్ చేసింది. నిర్మాణ పనుల గురించి సిబ్బందితో మాట్లాడగా.. రెండు నెలల నుంచి పనులు నిలిపివేశారని తెలిపారు. దీంతో స్థానికులు ఆందోళనకు దిగారు. 'కొడంగల్ అభివృద్ధి పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ'ని ఏర్పాటు చేసి ఉద్యమ బాట పట్టారు. ఇంత జరుగుతున్నా.. సంబంధిత అధికారులు వాస్తవాలను దాచిపెడుతున్నారని ఆరోపిస్తున్నారు.

20 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్

పాత కొడంగల్ సమీపంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల భవనాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలన్నీ ఒకే ప్రాంగణంలో ఉండేలా చర్యలు తీసుకుంది. అందుకు 20 ఎకరాల్లో అధునాతనమైన భవనాలను నిర్మించడానికి భూమి పూజ చేసింది. ఇందుకు రూ.100 కోట్లను సైతం మంజూరు చేసింది.

మెడికల్ కళాశాల

మండల పరిధి అప్పాయిపల్లి(ఎరన్‌పల్లి) గ్రామ శివారులో మెడికల్ కళాశాల నిర్మించడానికి ప్రభుత్వం రైతుల భూమి సేకరించింది. భవన నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కోసం రూ.124.50 కోట్లు మంజూరు చేసింది. నర్సింగ్ కళాశాల భవన నిర్మాణం, సౌకర్యాల కల్పనకు రూ.46 కోట్లు, ప్రభుత్వ ఫిజియోథెరపీ, పారామెడికల్ కళాశాలల నిర్మాణానికి రూ.27 కోట్లు మంజూరు చేసింది. నిర్మాణ పనులు చేపట్టడానికి ఏర్పాట్లు జరిగాయి. కానీ ప్రస్తుతం పనులు నిలిచిపోయాయి.

అభివృద్ధి పనులను తరలించ వద్దు

మండలానికి మంజూరు అయిన విద్యా సంస్థలను తరలించవద్దని ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మెడికల్ కళాశాల, గురుకులాలను లగచర్లకు తరలిస్తున్నారని ఆరోపించారు. అలా చేయడం వలన ఈ ప్రాంతానికి నష్టం జరుగుతుందని వాపోయారు. అనంతరం కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా లక్ష్మీనారాయణ గుప్తా, కో–కన్వీనర్లుగా సురేష్ కుమార్, శ్రీనివాస్, శాంత కుమార్, గౌసన్, నవాజ్, రమేష్‌బాబులను నియమించారు.



ఐనెల్లిలో ఆరబెట్టిన సోయాబీన్స్

కుండపోత.. గుండెకోత

అతివృష్టి అనావృష్టి అంటారు. ఈ ఏడు అదే జరిగింది. కాలం కొంత ఆలస్యంగా అయినా.. బాగా అయిందని రైతన్నలు మురిసిపోయారు. ఆ మురిపెం ఎన్నో రోజులు ఉండలేదు. కుండపోత వర్షాలతో పత్తి, సోయాబీన్, వరి తదితర పంటలకు తీవ్రనష్టం కలిగించి, అన్నదాతలకు గుండెకోత మిగిల్చింది.

- అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటలు
- సోయాబీన్‌పై అధిక ప్రభావం
- తగ్గిన దిగుబడి.. నల్లబడిన గింజ
- నన్నగిల్లిన మద్దతు ధర

తాండూరు రూరల్: భారీ వర్షాల కారణంగా సోయాబీన్ సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట నష్టపోయి దిగాలు చెందుతున్నారు. తాండూరు మండలం ఐనెల్లి, కోటబాసుపల్లి, మిట్టబాసుపల్లి, జినుగుర్తి గ్రామాల్లో 600 ఎకరాల్లో సోయాబీన్ సాగు చేశారు. ఈ సాగు.. మధ్యప్రదేశ్ తరువాత తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్, మెదక్‌లో విస్తృతంగా సాగవుతోంది. మండల పరిధి ఐనెల్లి గ్రామానికి చెందిన రైతు మాధవరెడ్డి తొలిసారిగా 1996లో తన సాగుభూమిలో సోయాబీన్ సాగు చేశారు. దానిని చూసిన ఆ గ్రామ రైతులు చాలామంది ఈ పంట సాగుకు మక్కువ చూపారు.

తగ్గిన దిగుబడి

సోయాబీన్ గతంలో ఎకరాకు దాదాపు 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ప్రస్తుతం భారీ వర్షాల కారణంగా 5 నుంచి 6 క్వింటాళ్లు మాత్రమే వస్తోందని రైతులు చెబుతున్నారు. ఇంకా 20 శాతం పొలాల్లో పంట ఉందని, వాన కారణంగా కోత యంత్రం పొలాల్లోకి వెళ్లలేని పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గింజ నల్లగా మారడంతో మార్కెట్లో సరైన మద్దతు ధర దొరకడం లేదని పేర్కొంటున్నారు. మార్కెట్లో మద్దతు ధర రూ.5,328 ఉందని, కానీ తాండూరు వ్యవసాయ మార్కెట్లో మాత్రం ప్రస్తుతం క్వింటాకు రూ.4,100లకే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని రైతులు తెలిపారు. ఇలా అయితే పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎకరాకు రూ.25 వేలు

సోయాబీన్ సాగు ఎకరాకు రూ.25 వేల పెట్టుబడి అవుతుందని రైతులు తెలిపారు. ఎకరాకు 30 కిలోల విత్తనాలు అవసరమని, వాటికి రూ.3,200 ధర ఉందని చెప్పారు. జూన్ రెండో వారంలో ప్రారంభించి, సెప్టెంబర్ నెల ఆఖరు వరకు పంట చేతికి వస్తోందని పేర్కొంటున్నారు. విత్తనాలు, కలుపు, ఎరువులు, కోత మిషన్ అన్నీ కలుపుకొని ఎకరాకు పైన పేర్కొన్న ఖర్చు అవుతుందంటున్నారు.

పెట్టుబడి కష్టమే..



12 ఎకరాల్లో సోయాబీన్ సాగు చేశాను. గతంలో ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. వర్షాల కారణంగా ప్రస్తుతం 6 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. గింజలు నల్లగా మారాయి. మద్దతు ధర కరువైంది. ఈ ఏడు పెట్టుబడులు కూడా వచ్చేలా లేవు. ప్రభుత్వం ఆదుకోవాలి.

– మాధవరెడ్డి, రైతు, ఐనెల్లి

ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం



ఆగస్టులో కురిసిన వర్షాలతో చాలా పంటలు దెబ్బతిన్నాయి. వాటి వివరాలను సేకరించాము. అందులో సోయాబీన్ ఉన్నట్లు గుర్తించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సెప్టెంబర్‌లో నష్టపోయిన పంటల వివరాలను తెలుసుకుంటున్నాము. సోయాబీన్ నష్టంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– కొమురయ్య, ఏడీఏ, తాండూరు డివిజన్

ఆధ్యాత్మికం.. అదృష్టం

శ్రీవారి సేవలో రుద్రారం భజన మండలి



తిరుమలలో భజన మండలి సభ్యులు(ఫైల్)

'ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతంగా ఉన్నాము. వృత్తిపరమైన పనులు చేసుకుంటూనే.. టీటీడీ ఆహ్వానం మేరకు ఏటా ఏడుకొండలు సన్నిధిలో జరిగే అఖండ హరినామ సంకీర్తనలో పాల్గొంటున్నాం. శ్రీవారి సేవలో తరిస్తున్నాము. దీనిని తమ అదృష్టంగా భావిస్తున్నాము' అని రుద్రారం వీరాంజనేయ భజన మండలి సభ్యులు అన్నారు.

- ఏటా అఖండ హరినామ సంకీర్తనలో పాల్గొంటున్న సభ్యులు
- వృత్తి పనులు చేసుకుంటూనే సంగీతంలో ప్రావీణ్యం

కొడంగల్ రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానం తిరుమలలో నిర్వహించే అఖండ హరినామ సంకీర్తనలో కొడంగల్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన వీరాంజనేయ భజన మండలి సభ్యులు పాల్గొంటున్నారు. వీరు గ్రామంలోని పురాతన వీరాంజనేయ ఆలయంలో ప్రతి శనివారం, పండుగ, ప్రత్యేక రోజుల్లో భజనలు చేయడంతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

14 ఏళ్ల ప్రస్థానం

ఆధ్యాత్మిక కార్యక్రమాల నేపథ్యంలో మహబూబ్‌నగర్ దేవాదాయ శాఖ కార్యాలయం సూచన మేరకు భజన మండలి సభ్యులు.. 2012లో తిరుమలలో నిర్వహించే అఖండ హరినామ సంకీర్తనలో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం టీటీడీ నుంచి ఆహ్వానం అందింది. అదే ఏడు అక్టోబర్ 10న 18మంది సభ్యులు తొలిసారి అఖండ పారాయణంలో పాల్గొన్నారు. అలా మొదలైన వీరి ప్రస్థానం 14 ఏళ్లుగా కొనసాగుతోంది. గత నెల సెప్టెంబర్ 11,12 తేదీల్లో ఉదయం 8నుంచి 10గంటలు, రాత్రి 8నుంచి 10గంటల వరకు, రెండు రోజులు 8 గంటల పాటు పారాయణంలో పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బహుమతి

2021– 22లో రవీంద్రభారతిలో 'భక్తి భజన సంకీర్తన పరిషత్' ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి భజన పోటీల్లో 4వ స్థానం బహుమతిని భజన మండలి అందుకుంది. మండలిలో 18 మంది సభ్యులు ఉండగా.. ఇందులో 13 మంది వ్యవసాయం చేస్తూనే.. సంగీతంలో ప్రావీణ్యం పొందారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇద్దరు వైద్యులు, మరో ఇద్దరు వ్యాపారులు, ఒకరు రాజకీయ నేత ఉన్నారు. ఇటీవల శ్రీశైలంలో అఖండ శివనామ స్మరణలో సభ్యులు పాల్గొన్నారు.



రవీంద్రభారతిలో పురస్కారం అందుకుంటున్న సభ్యులు(ఫైల్)

ఉల్లాసంగా ఉంది



నిత్యం కొంత సమయం దైవ చింతనతో గడుపుతాను. దాంతో మనసు ఉల్లాసంగా ఉండటంతో పాటు.. ప్రశాంతత చేకూరుతుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నాను.

– డాక్టర్ సంగమేశ్, మండలి సభ్యుడు

అదృష్టం



మహా పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానంలో ఏడాదిలో ఓ పర్యాయం అఖండ హరినామ సంకీర్తనలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నాను. గ్రామంలోని ఆలయంలో ప్రతి శనివారం, ప్రత్యేక రోజుల్లో భజనలు నిర్వహిస్తున్నాము.

– డాక్టర్ మనోహర్, సభ్యుడు

సాగుచేస్తూనే..



మండలిలోని 13 మంది వ్యవసాయం చేస్తూనే.. సంకీర్తనలో పాల్గొంటున్నాం. ఆలయంలో భజనలు చేస్తుండగా తిరుమల నుంచి ఆహ్వానం అందింది. దీంతో క్రమం తప్పకుండా 2012 నుంచి నేటి వరకు ఏటా అఖండ పారాయణంలో పాల్గొంటున్నాం.

– బన్సీలాల్, సభ్యుడు

క్లుప్తంగా

ద్విచక్ర వాహనం చోరీ

రాజేంద్రనగర్: ఇంటి ముందు పార్కు చేసిన ద్విచక్ర వాహనాన్ని ఓ దొంగ నిమిషాల వ్యవధిలో దొంగలించి పారిపోయిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... బుద్వేల్ హనుమాన్ దేవాలయం ప్రాంతంలో మసూద్ తన కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. ప్రైవేటు ఉద్యోగం నిర్వహించే మసూద్ ఈ నెల 8వ తేదీన రాత్రి విధులు నిర్వహించుకొని తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్కు చేసి లోనికి వెళ్లాడు. లోపలికి వెళ్లిన 15 నిమిషాల అనంతరం బయటికి వచ్చి చూడగా వాహనం కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల ప్రాంతాలు వెతికినా ప్రయోజనం లేకపోవడంతో రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించాడు. ఓ యువకుడు ద్విచక్ర వాహనాన్ని కేవలం నిమిషాల వ్యవధిలోనే తీసుకొని ఉడాయించాడు. ఈ దొంగతనానికి సంబంధించిన పూర్తి దృశ్యాలు అక్కడే ఉన్న సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

రోడ్డు పాడు చేశారంటూ కారు డ్రైవర్‌పై ఫిర్యాదు


వేస్తున్న రోడ్డుపైకి వచ్చిన కారు

మణికొండ: భారీ వర్షాలతో గుంతల మయంగా మారిన రోడ్డు పనులను ఓ వైపు చేస్తుండగానే ఓ కారు దానిపైకి వచ్చి మొత్తం పాడు చేసింది. దాంతో ఇంజనీరింగ్ అధికారులు కారు యజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేసి కారును పోలీసులకు అప్పగించారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని పాత ఆంధ్రా బ్యాంక్ చౌరస్తా నుంచి మర్రిచెట్టు వైపు ఉన్న రోడ్డు గుంతల మయంగా మారటంతో రెండు రోజులుగా కొత్త రోడ్డు పనులను చేపడుతున్నారు. ఆ విషయం గమనించకుండా ఆదివారం ఉదయం ఓ కారు వేస్తున్న రోడ్డుపైకి వచ్చి మొత్తం పాడు చేసింది. విషయం తెలుసుకుని మణికొండ మున్సిపల్ డీఈ శివసాయి సదరు కారు యజమానిపై రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేసి కారును వారికి అప్పగించినట్టు తెలిపారు. ప్రజలందరికీ అవసరమయ్యే పనులను చేపడుతున్నపుడు వారు సహకరించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. పది రోజుల పాటు సదరు రోడ్డును మూసి ఉంచుతున్నామని, ప్రయాణికులు ఇతర రోడ్ల ద్వారా వెళ్లాలని ఆయన కోరారు.

ఫ్లైట్‌లో ప్రయాణికుడికి అనారోగ్యం

శంషాబాద్: విమానంలో ఓ ప్రయాణికుడు అస్వస్థతకు గురికావడంతో విమానం తిరిగి వచ్చి ఆలస్యంగా బయలుదేరిన సంఘటన ఆదివారం శంషాబాద్ విమానాశ్రయంలో చోటు చేసుకుంది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఇండిగో విమానం 6ఈ-6223 విమానంలో 166 మంది ప్రయాణికులతో సాయంత్రం 3.55 గంటలకు బిహార్ రాజధాని పాట్నాకు టేకాఫ్ తీసుకుని బయలుదేరింది. కొద్ది నిమిషాల అనంతరం 11ఈ సీటులో కూర్చున్న ప్రయాణికుడు సంతోష్‌కుమార్ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో పాటు వాంతులు చేసుకోవడంతో వెంటనే పైలట్ అధికారుల అనుమతితో ఎయిర్‌పోర్టులో 4.15 గంటలకు తిరిగి ల్యాండ్ చేశారు. అస్వస్థతకు గురైన ప్రయాణికుడికి ఆస్పత్రికి తరలించారు. తిరిగి విమానం సాయంత్రం 5.56 గంటలకు 165 మంది ప్రయాణికులతో పాట్నా బయలుదేరింది.

కూతురిలా ఉన్నావంటూనే..

- అనభ్యకరంగా ప్రవర్తించిన పై అధికారి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన యువతి, కేసు నమోదు

బంజారాహిల్స్: కూతురిలా ఉన్నావని ప్రారంభంలో మర్యాదగా మాట్లాడి.. చనువు పెంచుకుని మెల్లమెల్లగా తన దుర్బుద్ధిని బయటపెట్టిన సీనియర్ అధికారిపై ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. మైండ్‌స్పేస్‌లోని ఓ ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలో హెచ్ఆర్‌గా పనిచేస్తున్న యువతి (26)కి తన పైఅధికారిగా పనిచేస్తున్న మృణాల్‌దాస్ (51)తో పరిచయం ఏర్పడింది. తరుచూ ఇద్దరూ మాట్లాడుకునేవారు. తన కుమార్తెలా ఉన్నావంటూ మృణాల్‌దాస్ ఆత్మీయతంగా వ్యవహరించేవాడని యువతి పేర్కొంది. జులై 5న ఆమె.. మృణాల్‌దాస్‌తో కలిసి జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-72లో ఉన్న ది స్విఫ్ట్ ఎలిమెంట్ స్పాకు వెళ్లినట్లు తెలిపింది. పురుషులు, మహిళలకు వేర్వేరు గదులు ఉన్నాయని చెప్పడంతో తాను వెళ్లగా తనకు మసాజ్ చేస్తున్న సమయంలో నిద్రలో ఉండగా ఒక దశలో వెనుక నుంచి వేరొకరి చేతులు తగిలాయని, గమనించి చూసేసరికి మృణాల్‌దాస్ తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని గుర్తించానంది. తనపై అనుచితంగా ప్రవర్తిస్తూ అసభ్యకరంగా మాట్లాడుతుండటంతో తాను అరిచి మందలించానని తెలిపింది. ఆయన గది నుంచి వెళ్లిపోయినప్పటికీ మళ్లీ రావాలని ప్రయత్నించాడని ఆరోపించింది. ఇటీవల ఆయన లండన్‌కు వెళ్లడం జరిగిందని, అక్కడి నుంచి కూడా వీడియో కాల్ ద్వారా అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆరోపించింది. ఈ సంఘటనను తాను పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ సంస్థ హెచ్ఆర్ టీమ్‌కు కూడా తెలియజేశానని పేర్కొంది. తన భద్రత పట్ల భయంగా ఉందని, ఆయన మళ్లీ వేధించే అవకాశం ఉందంటూ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. జూబ్లీహిల్స్ పోలీసులు మృణాల్‌దాస్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెల్లబంగారం మెరిసేనా!

- మద్దతు ధర దక్కేనా
- వారం రోజుల్లో చేతికి రానున్న పంట
- వర్షాలతో దిగుబడిపై ప్రభావం
- పెరిగిన పెట్టుబడులు


దెబ్బతిన్న పత్తి పంట

దౌల్తాబాద్: మరో వారం పది రోజుల్లో పత్తి పంట చేతికి రానుంది. రెండు మూడేళ్లుగా దిగుబడి ఉన్నప్పటికీ.. సరైన మద్దతు ధర లేదు. ఈ సారి తెల్ల బంగారం బాగా పండినప్పటికీ.. అధిక వర్షాలు దిగుబడిపై ప్రభావం చూపాయి. పెట్టుబడులు పెరిగాయి. అయితే ఈ లోటు పూడ్చుకోవడానికి మద్దతు దక్కితే ఊరట లభించనుందని రైతులు పేర్కొంటున్నారు.

పెరిగిన ఖర్చులు

మండలంలో ఈ ఏడు 8,900 ఎకరాల్లో పత్తి సాగు అయింది. గతం కంటే పెట్టుబడులు పెరిగాయి. ఎకరాకు రూ.40 వేల పైనే ఖర్చు అయింది. అయితే నిన్నమొన్నటి వానల కారణంగా పొలాల్లో నీరు నిలిచి, మొక్కలకు తెగుళ్లు సోకాయి. వాటి నివారణకు మందులు పిచికారీ చేసేందుకు అధిక వ్యయం వెచ్చించాల్సి వచ్చిందని రైతులు తెలిపారు. దిగుబడి తగ్గిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల పత్తి రావాల్సి ఉండగా, ప్రస్తుతం 6 నుంచి 8 క్వింటాళ్లు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. అధిక వర్షాలతో నష్టపోయామని, ధర పెంచి ప్రభుత్వం ఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.

అదే పదివేలు..

గడిచిన రెండేళ్లుగా పత్తి ధర నిలకడగా లేదని, క్వింటాకు రూ.10 వేలు పలికేదని రైతన్నలు తెలిపారు. ఆ తర్వాత రూ.8 వేలకు పడిపోయిందన్నారు. ధర పెరుగుతుందన్న ఆశతో చాలా మంది పత్తిని నిల్వ చేసుకుని నష్టపోయారని, ఈ సారి పెరిగిన పెట్టుబడులకు రూ. అదే పదివేలు ఉంటే తప్ప మేలు జరగదంటున్నారు.

ధర పెంచితే మేలు



రెండు సంవత్సరాలుగా పత్తికి మద్దతు ధర లేదు. పెట్టుబడులు మాత్రం అంతకంతకూ పెరిగిపోతున్నాయి. ఈ ఏడాది అధిక వర్షాలు దిగుబడిపై ప్రభావం చూపాయి. కనీసం ధర పెంచితే మేలు జరుగుతుంది.

–నర్సింహులు, రైతు, దౌల్తాబాద్

పర్యావరణ రక్షణకు కృషి చేయాలి

పర్యావరణ వేత్త, ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి


మాట్లాడుతున్న ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పర్యావరణ వేత్త, ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అన్మాస్‌పల్లి సమీపంలోని ఎర్త్‌సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణ మార్పులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఐక్యరాజ్య సమితి బ్రెజిల్ దేశంలో నవంబర్ 10వ తేదీ నుంచి 21 వరకు నిర్వహించనున్న కాప్-30 కార్యక్రమానికి సమాంతరంగా కొనసాగనున్న కాన్ఫరెన్స్ ఆఫ్ పీపుల్స్ పేరుతో నిర్వహించనున్న సదస్సుకు ముందస్తుగా ఈ సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీజీఆర్ చైర్‌పర్సన్ లీలాలక్ష్మారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ.. కాప్ కార్యక్రమం మొదటగా 1995 మార్చి 28 నుంచి ఏప్రిల్ 7వరకు జర్మనీలో నిర్వహించారని చెప్పారు. ప్రపంచంలో ఒక శాతం జనాభా ఉన్నవారి స్వార్థం కోసం చేస్తున్న ప్రకృతి విధ్వంసంతో 99 శాతం మంది ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అడవులు జీవవైవిధ్యాన్ని, పర్యావరణ వ్యవస్థలను పరిరక్షించాలని, సహజ ఆవాసాలను పరిరక్షించడం, స్థిరమైన భూ వినియోగాన్ని ప్రోత్సహించడం తదితర చర్యలు చేపట్టాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు సీజీఆర్ సంస్థ నిర్విరామంగా ఐదేళ్లుగా కాప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాలసీ నిపుణులు దొంతి నర్సింహారెడ్డి, సీజీఆర్ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి, విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారిణి రాజేశ్వరి, పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ సాయిభాస్కర్‌రెడ్డి, ఐఆర్ఎస్ అధికారి బండ్లమూడి సింగయ్య, వందేమాతరం ఫౌండేషన్ రవీందర్ రావు, సీజీఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

హత్య పాపం వారిదే..

తండ్రి, కొడుకులను అరెస్టు చేసిన పోలీసులు

షాబాద్: హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించిన కేసును షాబాద్ పోలీసులు ఛేదించారు. సొంత తండ్రి, తమ్ముడే హత్య చేసినట్లు నిర్ధారించారు. షాబాద్ సీఐ కాంతారెడ్డి తెలిపిన ప్రకారం.. ఈనెల 8న మండల పరిధిలోని కుర్వగూడకి చెందిన దాదే బాలకృష్ణ(45) ఇంట్లో మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దర్యాప్తు చేపట్టారు. విచారణలో తండ్రి, తమ్ముడు బాలకృష్ణని చున్నీతో ఉరివేసి, చంపినట్లుగా నిర్ధారించారు. ఆపై ఆత్మహత్య చేసుకున్నట్లుగా నమ్మించారు. ఆదివారం నిందితులిద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యం


నేనావత్ రమ్లి (ఫైల్)

ఆమనగల్లు: మున్సిపల్ పరిధిలోని నుచ్చుగుట్ట తండాకు చెందిన నేనావత్ రమ్లి అదృశ్యమైంది. ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన ప్రకారం.. తండాకు చెందిన రమ్లి కుటుంబ సభ్యులతో గొడవ కారణంగా మనస్తాపానికి గురై ఇంటినుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు సాధ్యమైన ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె కుమారుడు భీమన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రీన్ చానల్ ద్వారా అవయవాల రవాణా

శంషాబాద్: గ్రీన్‌చానల్ ద్వారా శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి కిమ్స్ ఆస్పత్రికి అవయవాలను రవాణా చేశారు. ఆదివారం రాత్రి 6ఈ-216 విమానంలో విశాఖపట్నం నుంచి తీసుకొచ్చిన ఊపిరితిత్తులు రాత్రి 9 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరకున్నాయి. ఎయిర్‌పోర్టు నుంచి గ్రీన్‌చానల్ ద్వారా ప్రత్యేక అంబులెన్స్‌లో ట్రాఫిక్ క్లియరెన్స్ చేపట్టి 30 నిమిషాల్లోపు సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

రక్తమోడుతున్న రహదారి..!


పెద్దషాపూర్ శివారులో అసంపూర్తిగా ఉన్న జాతీయ రహదారి విస్తరణ పనులు

- బెంగళూరు జాతీయ రహదారి విస్తరణ పనుల్లో జాప్యం
- వాహనదారులకు శాపం


మదన్‌పల్లి శివారులో అసంపూర్తిగా రోడ్డు పనులు

శంషాబాద్ రూరల్: రహదారి విస్తరణ పనుల్లో జాప్యం నెలకొనడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తొండుపల్లి రైల్వే వంతెన సమీపం నుంచి పాల్మాకుల వరకు మండల పరిధిలో జరుగుతున్న పనుల కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పనులను ప్రారంభించి దాదాపు మూడేళ్ల గడిచినా... ఓ అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కు అన్నట్లుగా మారింది. ఈ రహదారిపై రాత్రి సమయంలో ప్రయాణం వాహనదారులకు నరక ప్రాయమవుతోంది.

ఆరు వరుసలుగా...

శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని తొండుపల్లి నుంచి కొత్తూరు వరకు 12 కిలోమీటర్ల దూరం వరకు ఈ జాతీయ రహదారిని విస్తరిస్తున్నారు. ప్రస్తుతం నాలుగు వరుసలుగా ఉన్న రహదారిని ఆరు వరుసలకు విస్తరించడానికి సుమారు రూ. 540 కోట్లు కేటాయించారు. ఈ పనులను 2022 ఏప్రిల్‌లో కేంద్ర మంత్రి ఘడ్కరీ ప్రారంభించారు. ఆరంభంలో పనులు జోరుగా సాగినా.. మధ్యలో ఏడాది పాటు పనులు నిలిచిపోయాయి. అడపాదడపా అక్కడక్కడ పనులు చేస్తూ.. కాలం సాగదిస్తున్నారు.

ప్రమాదాలతో ప్రాణాలకు ముప్పు...

విస్తరణ పనులు పూర్తి కాకపోవడంతో రహదారిపై జరుగుతున్న ప్రమాదాలతో వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. రెండేళ్ల కాలంలో పదుల సంఖ్యలో వాహనదారుల ప్రాణాలు గాల్లో కలిసాయి. ఇక గాయాలై ఆస్పత్రి పాలైన వాహనదారులు చాలా మంది ఉన్నారు.

- రెండు నెలల కిందట మదన్‌పల్లి శివారులో రహదారిపై బైక్ మీద వెళ్తున్న ఇద్దరు యువకులు రోడ్డు పక్కన నిర్మాణ సామగ్రిని ఢీకొని అక్కడిక్కడే మృతి చెందారు.
- పాల్మాకుల శివారులో బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి రహదారిపై జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు.
- ఏదైనా ప్రమాదం జరిగినా.. వాహనాలు మరమ్మతులకు గురైనా రోడ్డుపై గంటల కొద్ది ట్రాఫిక్ నిలిచిపోతుంది. రాత్రి వేళల్లో జరిగే ఘటనలతో వాహనదారులు చాలా అవస్థలు పడుతున్నారు.

బైకును ఢీకొన్న జీపు..ఇద్దరికి తీవ్రగాయాలు


బైకును ఢీ కొట్టిన జీపు

హస్తినాపురం: ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు స్నేహితులను వెనుక నుండి వేగంగా వచ్చిన జీపు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రవి నాయక్ తెలిపిన వివరాల ప్రకారం రాజన్న సిరిసిల్లకు చెందిన ఫయాజ్ (21) మంగళపల్లిలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాల నుండి బైకుపై అదే కళాశాలలో చదువుతున్న స్నేహితురాలు (21)తో కలిసి సాగర్ రింగ్‌రోడ్డు వైపు వస్తుండగా గుర్రంగూడ వద్ద యూటర్న్‌లో వెనుక నుంచి వేగంగా వచ్చిన థార్ కారు ఢీకొట్టింది. దీంతో ఫయాజ్ తలకు తీవ్రగాయాలు కాగా కుడి కాలు విరిగింది. వెనుక కూర్చున్న స్నేహితురాలి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు ఫోన్ చేయగా క్షతగాత్రులను అంబులెన్స్‌లో స్థానికంగా ఉన్న ఓ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఫయాజ్‌కు ప్రాథమిక చికిత్స అనంతరం మలక్‌పేటలోని యశోదా ఆసుపత్రికి తరలించగా, అతని స్నేహితురాలిని సికింద్రాబాద్ యశోదా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన జీపు డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం మరో ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవినాయక్ తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ వెంకటేశ్, సిబ్బంది

ఆమనగల్లు: పట్టణంలోని హైద్రాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై రాజీవ్ చౌరస్తా వద్ద ఆదివారం ఎస్ఐ వెంకటేశ్ ఆధ్వర్యంలో పోలీసులు పెద్ద ఎత్తున వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ లైసెన్స్, వాహనాలకు ఆర్‌సీ బుక్‌లు పరిశీలించారు. పలువురు డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేశ్ మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురికి రిమాండ్


కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ వెంకన్న

మొయినాబాద్‌రూరల్: ఆస్తి వివాదంలో వ్యక్తిని హత్య చేసేందుకు యత్నించిన ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించామని మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి చెప్పారు. వివరాలు.. సురంగల్ పౌల్ట్రీ ఫామ్‌లో 250 గజాల ప్లాట్ విషయంలో తగాదా జరుగుతోంది. ఈ క్రమంలో శనివారం రామగళ్ల ప్రసాద్, రామగళ్ల నందం, సావిత్రి దంపతులు రామగళ్ల శ్యామ్‌పై వేట కొడవలితో దాడి చేయంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని రాజేంద్రనగర్ న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

గుట్కావిక్రేతలపై కేసు


తనిఖీలు చేస్తున్న పోలీసులు

షాబాద్: నిషేధిత గుట్కాలు విక్రయిస్తున్న ఆరుగురిపై షాబాద్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ కాంతారెడ్డి తెలిపిన ప్రకారం.. హైతాబాద్, నాగర్‌గూడ పాన్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు, పొగాకు ఉత్పత్తులు ఆరుగురి వద్ద లభించాయి. దీంతో వారిపై కేసు నమోదు చేసి, గుట్కా, పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఎస్ఐ సతీశ్, ఏఎస్ఐ రామ్‌లాల్, కానిస్టేబుళ్లు శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ టవర్‌లో అగ్నిప్రమాదం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ, నార్సింగి రోడ్డులోని బీఆర్‌సీ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లోని బ్లాక్ జీకి విద్యుత్ సరఫరా చేసే కేబుళ్ల డెక్‌లో ఆదివారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన సిబ్బంది టవర్‌లో ఉన్న వారందరినీ అప్రమత్తం చేశారు. దాంతో వారంతా మెట్ల మార్గాల ద్వారా కిందకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే సరఫరాను నిలిపివేశారు. అగ్నిమాపక శాఖ వాహనాలు మంటలను ఆర్పివేశాయి. విద్యుత్ వైర్లు పూర్తిగా కాలిపోవటంతో టవర్‌లోని 19 అంతస్తులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మెట్ల మార్గంలో కిందకు పరుగులు తీస్తున్న క్రమంలో ముగ్గురు కింద పడిపోవటంతో గాయాలయ్యాయి.

ఇద్దరిని బలిగొన్న ఈత సరదా




రాజేంద్రనగర్: జలపాతంలో ఈతకొట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి ఇద్దరు పదో తరగతి విద్యార్థులు మృత్యువాత పడిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సులేమాన్‌నగర్ ఎం.ఎం.పహాడీకి చెందిన మహ్మద్ రెహాన్ (16), సోహేల్ (15)లతో పాటు మరో నలుగురు బైక్‌లపై ఆదివారం మధ్యాహ్నం రాజేంద్రనగర్ గోల్డెన్ హైట్స్ ప్రాంతంలోని మొండికత్వ ప్రాంతానికి చేరుకున్నారు. జనచైతన్య వెంచర్‌లోని ఖాళీ స్థలంలో వాహనాలను పార్కు చేసి జలపాతం వద్దకు వెళ్లారు. ఈత కొట్టేందుకు ప్రయత్నించగా.. ప్రమాదవశాత్తు మహ్మద్ రెహాన్, సోహేల్‌లు నీళ్లలో మునిగిపోయారు. ఈ విషయాన్ని రాజేంద్రనగర్ పోలీసులకు తెలపడంతో అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. రాత్రి 8 గంటల వరకు వెతికి ఇద్దరి మృతదేహాలు నీటిలోంచి వెలికితీశారు. ఘటనా స్థలం వద్ద మృతుల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

లిఫ్ట్ గుంతలో పడి కార్మికుడి మృతి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రమాదవశాత్తు భవనం నాలుగో అంతస్తు నుంచి లిఫ్ట్ గుంతలో పడి ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం ఉదయం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మహమూద్ షహబాజ్(19) కుటుంబ సభ్యులతో కలిసి బోరబండ ప్రాంతంలో ఉంటున్నాడు. వృత్తిరీత్యా ఫాల్‌సీలింగ్ పనులు చేసే షహబాజ్ కొన్ని రోజులుగా శాస్త్రీపురం ప్రాంతంలోని ఓ భవనంలో పనులు చేస్తున్నాడు. రోజు మాదిరిగానే ఆదివారం ఉదయం పనికి వచ్చి నాలుగో అంతస్తులో ఫాల్‌సీలింగ్ వేసే పని చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు కింద ఉన్న లిఫ్ట్ గుంతలో పడి మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకోని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆర్టీసీకి ఏఐ దన్ను



ప్రయాణికుల రద్దీ, డిమాండ్ మేరకు ట్రిప్పులు పెంచేందుకు ఆర్టీసీ ప్రణాళికలను రూపొందిస్తోంది. అధునాతన ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో వివిధ రూట్‌లలో ప్రయాణికుల సంఖ్య, రాకపోకలు, ప్రయాణ వేళలు తదితర అంశాలపై శాస్త్రీయమైన అధ్యయనం చేసి సమగ్ర నివేదికను సిద్ధం చేసేందుకు సాంకేతిక నిపుణుల సహాయం తీసుకోనుంది.

– సాక్షి, సిటీబ్యూరో

ఏ రూట్‌లో ఎంతమంది ప్రయాణికులు

- రద్దీ, డిమాండ్ మేరకు బస్సుల నిర్వహణ
- అధునాతన సాంకేతికత వినియోగం
- రూట్‌లపై శాస్త్రీయ అధ్యయనం
- ప్రయాణికుల సంఖ్య పెంపునకు ప్రణాళికలు

మహా నగర పరిధి అనూహ్యంగా విస్తరిస్తోంది. ప్రతి ఏటా కొత్త కాలనీలు ఏర్పడుతూనే ఉన్నాయి. దీంతో ప్రయాణికులు ఏ ప్రాంతం నుంచి ఎక్కువగా బయలుదేరుతున్నారు. ఏయే ప్రాంతాల మధ్య రాకపోకలు విరివిగా కొనసాగుతున్నాయనే అంశంపై స్పష్టత ఉండడం లేదు. జీడిమెట్ల, దుండిగల్ చుట్టుపక్కల ప్రాంతాల్లో విస్తరించిన వందల కొద్దీ కాలనీల నుంచి హైటెక్ సిటీ, మాదాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, మణికొండ, నార్సింగి, తదితర ప్రాంతాలకు ప్రయాణికుల రాకపోకలు భారీగా ఉన్నాయి. ప్రైవేట్ సంస్థల్లో పని చేసే వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది ఈ ప్రాంతాల నుంచి ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నారు. కానీ.. ప్రయాణికుల డిమాండ్ మేరకు బస్సులు అందుబాటులో ఉండడం లేదు. పైగా ఏ కాలనీ నుంచి, ఏయే సమయాల్లో ఎక్కువ మంది రాకపోకలు సాగిస్తున్నారనే అంశాలపై కూడా తగిన సమాచారం ఉండదు. ఈ క్రమంలో సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా రియల్ టైమ్ డిమాండ్‌ను కచ్చితంగా అంచనా వేసి బస్సులను ఏర్పాటు చేయాలనేది ప్రతిపాదన.

ప్రతి రూటూ వాస్తవ చిత్రీకరణ..

- ఆర్టీసీ లెక్కల ప్రకారం గ్రేటర్ పరిధిలో సుమారు 1050 రూట్‌లు ఉన్నాయి. గత ఐదారేళ్లుగా విస్తరించిన నగర శివార్లను పరిగణనలోకి తీసుకొంటే ఈ రూట్‌ల సంఖ్య 1500 దాటి ఉంటుంది. కొన్ని రూట్‌లలో ప్రయాణికుల డిమాండ్, రద్దీ చాలా తక్కువగా ఉంటుంది. ఉదయం, సాయంతం వేళల్లో మాత్రమే ఎక్కువ మంది ప్రయాణం చేస్తారు. మిగతా వేళల్లో పెద్దగా డిమాండ్ ఉండదు. అలాంటి రూట్‌లపై సరైన వివరాలు లేకుండా బస్సులను నడపడంతో నష్టం వాటిల్లుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఇలా ప్రయాణికుల ఆదరణ లేని మార్గాల్లో ట్రిప్పులను తగ్గించి, డిమాండ్ ఎక్కువగా ఉన్న మార్గాల్లో పెంచేందుకు ప్రతి రూట్‌ను సమగంగా అధ్యయనం చేసి గణాంకాలను రూపొందించనున్నారు. ఇందుకోసం ఒక ప్రైవేట్ సంస్థకు చెందిన సాంకేతిక నిపుణుల సహాయంతో డిపోల వారీగా వివిధ రూట్‌ల వివరాలను సేకరించనున్నారు.
- గ్రేటర్‌లో ప్రస్తుతం 25 డిపోల్లో ప్రస్తుతం 3,150 బస్సులు ఉన్నాయి. వీటిలో 10 శాతం బస్సులను స్పేర్‌లోనే ఉంచుతారు. దీంతో సుమారు 2,950 బస్సులు ప్రతిరోజు ప్రయాణికులకు రవాణా సదుపాయాన్ని అందజేస్తున్నాయి. ప్రస్తుతం రోజుకు 26 లక్షల మంది ప్రయాణిస్తున్నట్లు అంచనా. ప్రతి రోజు 31వేలకు పైగా ట్రిప్పులు తిరుగుతున్నాయి. ప్రతి ట్రిప్పు నుంచి ఆశించిన స్థాయిలో ఆదాయం లభించడం లేదు. ఆదాయం కంటే నిర్వహణ వ్యయం ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో అన్ని ట్రిప్పులను క్రమబద్ధీకరించాలని భావిస్తున్నారు.



ఆక్యుపెన్సీ ఉన్నా ఆదాయం అంతంతే...

మహాలక్ష్మి పథకంతో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. సుమారు 18 లక్షల మంది మహిళలు సిటీ బస్సుల్లో పయనిస్తున్నారు. వీరి చార్జీలను ప్రభుత్వమే చెల్లిస్తోంది. ప్రతిరోజు ఆర్టీసీకి నగదు రూపంలో ఆదాయం లభించేది పురుషుల నుంచే. ప్రతి రోజు 8 లక్షల మంది మగవారు ప్రయాణం చేస్తున్నారు. రోజుకు రూ.6.5 కోట్ల ఆదాయం లభిస్తే అందులో రూ.4 కోట్ల వరకు రియంబర్స్‌మెంట్ రూపంలో ఆర్టీసీ ఖాతాలో జమ అవుతోంది. మిగతా 2.5 కోట్లు మాత్రమే నగదు రూపంలో అందుతోంది. ఈ ఆదాయం కంటే నిర్వహణ వ్యయం, ఉద్యోగుల జీతభత్యాలు తదితర ఖర్చులే అధికంగా ఉన్నాయి. దీంతో ప్రయాణికుల సంఖ్యను పెంచుకొనేందుకు, తద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకొనేందుకు కూడా ఈ సాంకేతిక పరిజ్ఞానం దోహదం చేస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.